సాక్షి
కామారెడ్డి
గురువారం । 29 । జూన్ । 2023



డబ్బుల స్వాహాపై ఆగ్రహం

ఐకేపీ అధికారుల తీరుపై నిజాంసాగర్ మండలంలోని మహిళా సంఘాల సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

- 8లో ▸



ఆడపడుచులకు సీఎం కానుక

ఆడపడుచులకు కానుకగా సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి అందిస్తున్నారని ఎమ్మెల్యే జాజాల సురేందర్ పేర్కొన్నారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
32.9 /22.6


వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. శీతల గాలులు వీస్తాయి. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

విచారణ ఉత్తిదేనా!?

ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల నిర్వహణలో భారీగా అక్రమాలు జరిగాయి. పరీక్షలు రాసే వారి నుంచి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేసినట్టు ఆరోపణలు వచ్చాయి. మాస్ కాపీయింగ్‌తోపాటు ఒకరికి బదులు మరొకరితో పరీక్షలు రాయించారు. పరీక్ష రాస్తూ పలువురు పట్టుబడ్డారు కూడా.. ఇలా అక్రమాలు 'ఓపెన్'గానే జరిగినా.. ఎవరిపైనా చర్యలు తీసుకోకపోవడంతో విద్యాశాఖ తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- 'ఓపెన్' పరీక్షలలో భారీగా అక్రమాలు
- ఒకరికి బదులుగా పరీక్ష రాసిన మరొకరు..
- తనిఖీలతో వెలుగులోకి వ్యవహారం
- నెలలు గడుస్తున్నా చర్యలు శూన్యం



సాక్షి, కామారెడ్డి: ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలను ఏప్రిల్ 25 నుంచి నిర్వహించారు. జిల్లాలో 11 పరీక్ష కేంద్రాల్లో 2 వేల మందికిపైగా పరీక్షలు రాశారు. అయితే మాస్ కాపీయింగ్‌తో పాటు ఒకరికి బదులు మరొకరు పరీక్ష రాసేందుకు సెంటర్ల నిర్వాహకులు కొందరు పరీక్ష రాస్తున్న వారి వద్ద నుంచి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలు వచ్చాయి. ఇలా అభ్యర్థులందరినుంచి జిల్లావ్యాప్తంగా రూ.2 కోట్లకుపైగా వసూలు చేశారని ప్రచారం జరిగింది. కామారెడ్డి పట్టణంలోని రెండు పరీక్ష కేంద్రాల్లో రాష్ట్ర అబ్జర్వర్ తనిఖీలు నిర్వహించిన సమయంలో మాస్ కాపీయింగ్ వ్యవహారం వెలుగు చూసింది. అలాగే ఒకరికి బదులు మరొకరు.. ఇలా 8 మంది పరీక్షలు రాసినట్లు గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు. అనంతరం అక్రమాలపై కామారెడ్డి ఆర్డీవో ద్వారా విచారణ జరిపించారు. అయితే విచారణ పేరుతో కాలాయాపన చేసి అక్రమార్కులను కాపాడే ప్రయత్నాలు జరిగినట్టు ఆరోపణలు వస్తున్నాయి.

భారీగా వసూళ్లు..

రెగ్యులర్‌గా చదువుకునే అవకాశం లేనివారికోసం ప్రభుత్వం ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో టెన్త్, ఇంటర్ చదువుకునే అవకాశం కల్పిస్తోంది. పదోన్నతుల కోసం పలువురు టెన్త్, ఇంటర్ చదువుతుంటారు. వీరి అవసరాలను ఆసరాగా తీసుకుంటున్న సెంటర్ల నిర్వాహకులు కొందరు.. అక్రమాలకు పాల్పడుతున్నారు. మాస్ కాపీయింగ్‌కు అవకాశం ఇప్పిస్తామని, వేరే వారితో పరీక్షలు రాయిస్తామని డబ్బులు వసూలు చేశారు. తమకు బదులు వేరే వాళ్లతో పరీక్షలు రాసే అవకాశం కల్పించినందుకు ఒక్కొక్కరి నుంచి రూ.20 వేల వరకు, చూచిరాతల(మాస్ కాపీయింగ్) కోసం రూ.10 వేల వరకు ఒక్కో విద్యార్థినుంచి వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. పరీక్ష కేంద్రాల వద్ద బహిరంగంగానే డబ్బులు వసూలు చేశారని ఫిర్యాదులు వచ్చాయి. ఇలా విద్యార్థులనుంచి రూ. 2 కోట్ల వరకు వసూలు చేసి వాటిని నిర్వాహకులు, అధికారులు పంచుకున్నారని ప్రచారం జరిగింది. యూపీఐ ద్వారా ఆన్‌లైన్‌లో డబ్బులు స్వీకరించినట్లు తెలుస్తోంది. ఈ భారీ అక్రమాలకు ఆన్‌లైన్ లావాదేవీలే కీలక ఆధారాలుగా ఉన్నాయి. అయితే పరీక్ష కేంద్రాల నిర్వాహకులకు కొందరు విద్యార్థులు ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించినట్టు విద్యార్థి సంఘాలు ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండాపోయింది. అక్రమాలు జరిగినట్టు ఆధారాలున్నా.. చర్యలకు విద్యాశాఖ అధికారులు వెనుకాడుతుండడంపై ఆరోపణలు వస్తున్నాయి. అక్రమార్కులకు కొందరు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు అండగా నిలుస్తుండడంతో ఉన్నతాధికారులు చర్యలకు వెనుకడుగు వేస్తున్నట్టు తెలుస్తోంది.

సైలెంట్ అయిన సంఘాలు..

ఓపెన్ టెన్త్, ఇంటర్ అక్రమాల విషయంలో నానాయాగీ చేసిన విద్యార్థి సంఘాలు కూడా ఇప్పుడు నోరుమెదపడం లేదు. రూ.2 కోట్లకుపైగా వసూళ్లు జరిగాయని ఆరోపిస్తూ విద్యార్థి సంఘాల నేతలు అప్పట్లో ధర్నాలు చేశారు. కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఏసీబీ తలుపు తట్టారు. విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి వద్దకు వెళ్లి కూడా ఫిర్యాదు చేశారు. తర్వాత ఏమయ్యిందోగానీ 'ఓపెన్' అక్రమాలపై వారూ సైలెంట్ అయ్యారు. ఉన్నతాధికారులు స్పందించి ఓపెన్ పరీక్షలలో అక్రమాలకు పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

న్యూస్‌రీల్

'గ్రూప్ -4'కు పకడ్బందీ ఏర్పాట్లు



కామారెడ్డి క్రైం: టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించే గ్రూప్ -4 పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ సూచించారు. బుధవారం ఆయన కలెక్టర్ కార్యాలయం నుంచి గ్రూప్ -4 పరీక్ష ఏర్పాట్లపై చీఫ్ సూపరింటెండెంట్లతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో 40 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. రూట్ ఆఫీసర్లను, లైజనింగ్ ఆఫీసర్లను నియమించామన్నారు. పరీక్ష సమయంలో సమీపంలోని జిరాక్స్ కేంద్రాలు మూసి వేయించాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఇన్విజిలేటర్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. ప్రతి పరీక్ష కేంద్రంలో 24 మంది అభ్యర్థులు ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఈవో రాజు, పరీక్షల విభాగం అధికారి ఎన్.లింగం, కలెక్టరేట్ ఏవో రవీందర్, అధికారులు పాల్గొన్నారు.

'క్విజ్ పోటీలో పాల్గొనాలి'



కామారెడ్డి టౌన్: రాజీవ్ గాంధీ క్విజ్ కాంపిటీషన్‌ను విద్యార్థులు విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని శ్రీగాయత్రి జూనియర్ కళాశాలలో ఆయన మాట్లాడారు. 2, 3, 4 తేదీలలో ఆన్‌లైన్‌లో క్విజ్ ఉంటుందన్నారు. 76618 99899 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇస్తే లింక్ వస్తుందని, దానిలో పూర్తి సమాచారాన్ని నింపి రిఫరల్ కోడ్ 15025 నమోదు చేయా లని సూచించారు. విజేతలకు బహుమతు లు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఐరేని సందీప్ కుమార్, నాయకులు వడ్ల సురేష్, రోషన్, ప్రవీణ్‌రెడ్డి, రాహుల్ పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల పరిశీలన



కామారెడ్డి టౌన్: ఇంజినీరింగ్‌లో ప్రవేశాలకోసం బుధవారం కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కౌన్సెలింగ్ ప్రారంభమైంది. విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకున్న విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్నారు. ఈ ప్రక్రియ శుక్రవారం వరకు కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

'బీజేపీకి ఒక్క సీటూ రాదు'



కామారెడ్డి టౌన్: అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ సున్నాకే పరిమితం కావడం ఖాయమని ఉర్దూ అకాడమీ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎంకే ముజీబొద్దీన్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ హాట్రిక్ సాధిస్తుందన్నారు. మహారాష్ట్ర ప్రజలు సైతం కేసీఆర్‌వైపు చూస్తున్నారన్నారు. కేసీఆర్‌కు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ప్రధానమంత్రి మోదీ విమర్శలు చేస్తున్నారన్నారు. కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు.

ఏసీబీ వలలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ

- రూ.10 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన శ్యాంసుందర్ రెడ్డి
- కార్యాలయ సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్‌ల అరెస్టు



కలెక్టరేట్‌లోని సర్వే ల్యాండ్ రికార్డు జిల్లా ఆఫీసర్ రూమ్‌లోకి వెళ్తున్న ఏసీబీ అధికారులు

సుభాష్‌నగర్: జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ (ఎస్‌ఎల్‌ఆర్) అసిస్టెంట్ డైరెక్టర్ శ్యాంసుందర్ రెడ్డితో పాటు కార్యాలయ సూపరింటెండెంట్ వెంకటేష్, జూనియర్ అసిస్టెంట్ రహీమా ఏసీబీ వలలో చిక్కారు. కలెక్టరేట్‌లోని ఎస్‌ఎల్‌ఆర్ కార్యాలయంలోనే బుధవారం రూ.10 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

మోర్తాడ్ మండలం ధర్మోరా గ్రామానికి చెందిన దుగ్గెన రాజేందర్ తన 5 గుంటల భూమిలో షెడ్డు నిర్మాణం కోసం నాలా కన్వర్షన్‌కు తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. సర్వేయర్ దరఖాస్తు పరిశీలించి నిజామాబాద్‌లోని ఎస్‌ఎల్‌ఆర్ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలని సూచించారు. ఎస్‌ఎల్‌ఆర్‌లో దరఖాస్తు చేసిన రాజేందర్ పదిరోజుల క్రితం తన భూమి లోకేషన్ స్కెచ్ మ్యాప్ కావాలని కార్యాలయంలో అడగగా, సూపరింటెండెంట్ వెంకటేష్ రూ.3 వేలు, జూనియర్ అసిస్టెంట్ రహీమా రూ.2 వేలు డిమాండ్ చేయగా ఇచ్చేశాడు. ఆ తర్వాత ఏడీని సంప్రదించగా ఆయన రూ.10 వేలు కావాలని స్థానిక సర్వేయర్‌తో రాజేందర్‌కు చెప్పించాడు. ఈ సందర్భంగా సర్వేయర్ డబ్బులతో తనకేం సంబంధం లేదని, ఏడీకి ఇవ్వాల్సిన అవసరం కూడా లేదని రాజేందర్‌కు సర్వేయర్ స్పష్టం చేశాడు. ఇదిలా ఉండగా మ్యాప్ అడిగే క్రమంలో ఏడీ చిరాకు పడి దరఖాస్తును రాజేందర్ ముఖంపై విసిరేశాడు. దీంతో బాధితుడు మంగళవారం ఏసీబీని ఆశ్రయించాడు. మరుసటి రోజు ఏసీబీ అధికారులు ఇచ్చిన రూ.10 వేలను రాజేందర్ తీసుకెళ్లి ఏడీ శ్యాంసుందర్ రెడ్డి టేబుల్ డ్రాలో పెట్టాడు. వెంటనే ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సుమారు 8 గంటలపాటు రికార్డులను తనిఖీ చేశారు. వినాయక్ నగర్‌లోని ఏడీ శ్యాంసుందర్ ఇంటి వద్ద కూడా సోదాలు చేపట్టారు. ముగ్గురిని కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నారు. దాడిలో ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, నగేష్ పాల్గొన్నారు. బాధితుడు రాజేందర్ మాట్లాడుతూ

లోకేషన్ స్కెచ్ మ్యాప్ కావాలని అడిగితే 15 రోజులుగా ఏడీ శ్యాంసుందర్‌రెడ్డి సతాయించాడని తెలిపారు. దరఖాస్తును ముఖంపై విసిరేయడంతో అవమానానికి గురై ఏసీబీ అధికారులను ఆశ్రయించినట్లు తెలిపారు.

చెరుకు రైతుకు తీపికబురు!

టన్నుకు రూ. వంద పెంపు

సాక్షి, కామారెడ్డి: చెరుకు రైతులకు కేంద్ర ప్రభుత్వం తీపికబురు చెప్పింది. ఈ సీజన్‌లో చెరుకు ధర టన్నుకు వంద రూపాయలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. జిల్లాలోని చక్కెర కర్మాగారాలు గతేడాది టన్ను చెరుకుకు రూ.3,370 చెల్లించాయి. ప్రస్తుతం రూ.వంద పెరగడంతో చెరుకు ధర రూ.3,470 కి చేరనుంది. దీంతో జిల్లాలో వేలాది మంది రైతులకు ప్రయోజనం కలుగుతుంది. జిల్లాలో అడ్లూర్ ఎల్లారెడ్డి, మాగి వద్ద ఉన్న గాయత్రి చక్కెర కర్మాగారాల పరిధిలో వేలాది మంది రైతులు చెరుకు సాగు చేస్తున్నారు. కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలతో పాటు పొరుగున ఉన్న జగిత్యాల, సిరిసిల్ల, మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల నుంచి కూడా ఈ కర్మాగారాలకు చెరుకు వస్తోంది. కేంద్ర ప్రభుత్వం ధర పెంచడంతో రైతులకు ప్రయోజనం చేకూరనుంది.

ప్రత్యామ్నాయ పంటలు వేయండి



డ్రాగన్ ఫ్రూట్ తోటను పరిశీలిస్తున్న కలెక్టర్

- 'సమగ్ర వ్యవసాయం'తో అధిక దిగుబడులు
- కలెక్టర్ జితేష్ వి పాటిల్

మాచారెడ్డి: ప్రతి గ్రామంలో సాగు నీటి వసతులు ఉన్నందున రైతులు వరి మాత్రమే కాకుండా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కూరగాయలు, పండ్ల తోటలు సాగు చేయాలన్నారు. బుధవారం కొత్తపల్లిలోని వ్యవసాయ క్షేత్రాలను ఆయన సందర్శించారు. రిలయన్స్ ఫౌండేషన్ అధ్వర్యంలో సమగ్ర వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తున్న క్షేత్రాలను పరిశీలించారు. గ్రామంలో సమగ్ర వ్యవసాయ పద్ధతులు పాటిస్తున్న శ్రీకాంత్, మల్లారెడ్డిలతో మాట్లాడి, వారు అవలంబిస్తున్న పద్ధతుల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర వ్యవసాయ పద్ధతుల ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. అనంతరం మాచారెడ్డిలో మహబూబ్ సాగుచేస్తున్న డ్రాగన్ ఫ్రూట్ క్షేత్రాన్ని సందర్శించారు. ఆయన వెంట సర్పంచ్ లక్ష్మణ్, ఎంపీడీవో బాలకృష్ణ, ఏవో రమ్యశ్రీ, అభ్యుదయ రైతు చంద్రయ్య, రిలయన్స్ ఫౌండేషన్ మేనేజర్ రాజు, సంస్థ ప్రతినిధులు వీరేశం, వినాయక్, నాగేందర్ ఉన్నారు.



ఈవీఎంల పనితీరును వివరిస్తున్న కలెక్టర్

గంజాయి సాగు చేస్తే 'సంక్షేమం' కట్

కామారెడ్డి క్రైం: గంజాయి సాగు చేస్తే ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిలిపివేస్తామని కలెక్టర్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం జిల్లా నార్కొటిక్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎక్కడైనా గంజాయి సాగు చేస్తే ఎక్సైజ్, పోలీస్ శాఖ అధికారులకు సమాచారం అందించాలన్నారు. డ్రగ్స్, గంజాయి అక్రమంగా రవాణా చేసే వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. సమావేశంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవీందర్ రాజు, ఇంటర్ బోర్డు నోడల్ అధికారి షేక్ సలాం పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా

కామారెడ్డి క్రైం: పారదర్శక ఓటరు జాబితా తయారీలో భాగస్వాములు కావాలని కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. కామారెడ్డిలోని ఈవీఎం గోదాంలో బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండేవారు శుక్రవారంలోగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంటింటి సర్వేతో డబుల్ ఓటర్లు, చనిపోయిన వారి పేర్ల తొలగింపునకు దరఖాస్తులను స్వీకరించి సవరణలు చేసి తుది జాబితాను ప్రకటిస్తామన్నారు. అనంతరం రాజకీయ పార్టీల నాయకులతో కలిసి ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల ఫస్ట్ లెవల్ తనిఖీలు నిర్వహించారు. వాటి పనితీరుకు సంబంధించి నాయకుల సందేహాలను కలెక్టర్, ఈసీఐఎల్ ఇంజినీర్‌లు నివృత్తి చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్, శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ వెంకట్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట ఎంపీపీపై అవిశ్వాసం!

- పావులు కదుపుతున్న బీఆర్‌ఎస్ నేతలు
- రసవత్తరంగా రాజకీయం



సాక్షి, కామారెడ్డి: రాజకీయ చైతన్యానికి మారుపేరైన నాగిరెడ్డిపేట మండలంలో మరోసారి రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ఇన్‌చార్జి ఎంపీపీగా ఉన్న రాజ్‌దాస్‌పై అవిశ్వాసం పెట్టేందుకు అధికార పార్టీ నేతలు పావులు కదుపుతున్నారు. అందులో భాగంగానే బుధవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీలు గైర్హాజరై, వాయిదా పడేలా చేశారని తెలుస్తోంది.

నాగిరెడ్డిపేట మండలంలో పది ఎంపీటీసీ స్థానాలున్నాయి. 2019 జూన్‌లో జరిగిన ఎన్నికల్లో ఐదు స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు, రెండు స్థానాల్లో బీఆర్‌ఎస్, మూడు స్థానాల్లో స్వతంత్రులు విజయం సాధించారు. జనరల్ మహిళకు ఎంపీపీ స్థానం రిజర్వు అయ్యింది. కాంగ్రెస్ పార్టీలో ఇద్దరు మహిళలు ఎంపీపీ పదవి కోసం పోటీ పడ్డారు. కాంగ్రెస్ అభ్యర్థిగా పోచారం గ్రామానికి చెందిన వినీతను పోటీలో నిలపగా.. అదే పార్టీకి చెందిన ధర్మారెడ్డి గ్రామ ఎంపీటీసీ సభ్యురాలు కృష్ణవేణి కూడా పోటీకి రెడీ అయ్యారు. ఎన్నికల్లో ఇద్దరికీ తలా ఐదు ఓట్లు వచ్చాయి. ఇద్దరికీ సమానంగా రావడంతో డ్రా తీయగా, కాంగ్రెస్ తిరుగుబాటు అభ్యర్థి కృష్ణవేణికి అదృష్టం దక్కింది. వైస్ ఎంపీపీగా తాండూర్ ఎంపీటీసీగా గెలిచిన స్వతంత్ర్య అభ్యర్థి దివిటి రాజ్‌దాస్‌తో పాటు గుర్రాల సుశీల పోటీ పడ్డారు. ఇద్దరికీ సమానంగా ఓట్లు వచ్చాయి. డ్రా తీయగా రాజ్‌దాస్ ఎన్నికయ్యారు. కాగా ఎంపీపీ ఎన్నికల్లో పార్టీ నిర్ణయాన్ని వ్యతిరేకించడం, విప్‌ను ధిక్కరించడంపై కాంగ్రెస్ పార్టీ నేతలు కృష్ణవేణిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ జరపగా, తనకు విప్ అందలేదని సదరు ఎంపీపీ పేర్కొన్నారు. విప్ తీసుకున్నట్టు చేసిన సంతకం తనది కాదని ఆమె పేర్కొనడంతో ఫోరెన్సిక్ పరీక్షలకు పంపించారు. సంతకం ఆమెదే అని నిర్ధారణ కావడంతో ఎంపీటీసీగా అనర్హురాలిగా ప్రకటించారు. దీంతో ఎంపీపీ పదవి పోయింది.

కావాలనే గైర్హాజర్..

ఇన్‌చార్జి ఎంపీపీగా ఉన్న రాజ్‌దాస్ గతంలో తెలుగుదేశం పార్టీలో ఉన్నారు. ఆయనకు గతంలో టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి అవకాశం వచ్చినట్టే వచ్చి చేజారింది. నాలుగేళ్లుగా ఇన్‌చార్జి ఎంపీపీగా కొనసాగుతున్న రాజ్‌దాస్ ఏ పార్టీలోనూ చేరలేదు. స్వతంత్రంగానే ఉన్నారు.

అధికార పార్టీకి చెందిన నాయకులు రాజ్‌దాస్‌ను పదవి నుంచి దింపేందుకు పావులు కదపడం మొదలుపెట్టారు. ఎలాగైనా ఆయనను పదవి నుంచి దింపాలని భావిస్తున్న అధికార పక్షం.. కావాలనే మండల సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైనట్లు తెలుస్తోంది. అవిశ్వాసం పెట్టేందుకు అధికారులనూ సంప్రదించినట్లు సమాచారం. దీంతో మండలంలో రాజకీయాలు వేడెక్కాయి.

నాలుగేళ్లుగా ఇన్‌చార్జి పాలనే..

ఎంపీపీగా ఎన్నికైన కృష్ణవేణి అనర్హతకు గురవడంతో ఇన్‌చార్జి ఎంపీపీగా వైస్ ఎంపీపీ రాజ్‌దాస్ బాధ్యతలు చేపట్టారు. అనర్హత వేటుతో ఖాళీ అయిన ధర్మారెడ్డి ఎంపీటీసీ స్థానానికి ఉప ఎన్నికలు నిర్వహించలేదు. ఉప ఎన్నిక జరగకపోవడంతో ఎంపీపీ ఎన్నిక కూడా చేపట్టలేదు. సీనియర్ నాయకుడైన రాజ్‌దాస్.. తన రాజకీయ అనుభవంతో అధికారులతో సన్నిహిత సంబంధాలు నెరుపుతూ నాలుగేళ్లుగా ఇన్‌చార్జీ ఎంపీపీగా కొనసాగుతున్నారు.

'విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం'

బాన్సువాడ: విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ కూడా అవసరమని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని సరస్వతి శిశు మందిర్‌లో రూ.15 లక్షల నిధులతో చేపట్టే అదనపు తరగతి గదుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, విలువలు తెలుసు కాబట్టే నియోజకవర్గంలో విద్యాలయాల అభివృద్ధికి సాధ్యమైనంత ఎక్కువగా సహాయం చేస్తున్నానన్నారు. నియోజకవర్గానికి బీసీ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాల మంజూరు కోసం ప్రయత్నిస్తున్నానన్నారు. కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ నాగులగామ వెంకన్న, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, నాయకులు అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, ఎజాస్, శ్రీనివాస్ రెడ్డి, అమేర్, మోహన్ నాయక్, పాత బాలకృష్ణ, లింగం, రుక్మిణి, వనం గంగాధర్, శ్రీధర్, విఠల్‌రెడ్డి, వెంకటేష్, నర్సగౌండ తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న స్పీకర్ పోచారం

ఉమ్మడి జిల్లాకు రూ. 138 కోట్లు

- నిధులు విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం
- 2023-24 స్పెషల్ అసిస్టెన్స్ ఆఫ్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ స్కీం కింద మంజూరు
- వైద్య సదుపాయాలు, రోడ్ల అభివృద్ధి కోసం కేటాయింపు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: భారత ప్రభుత్వం 'స్పెషల్ అసిస్టెన్స్ ఆఫ్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ 2023-24'కు గాను ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు రూ. 138.43 కోట్లు విడుదల చేసింది. ఇందులో భాగంగా వివిధ పనుల కోసం నిధులు మంజూరు చేసింది.

నిజామాబాద్ జిల్లాకు కేటాయించిన నిధులు

- భీమ్‌గల్‌లో కొత్తగా 100 పడకలతో ఏరియా ఆస్పత్రిని నిర్మించేందుకు గాను రూ. 20 కోట్లు.
- బడాభీమ్‌గల్ నుంచి మోతె వరకు 5కిలోమీటర్ల మేర రోడ్డును సింగిల్ లేన్ నుంచి డబుల్ లేన్‌కు మార్చేందుకు గాను రూ. 6 కోట్లు.
- భీమ్‌గల్ నుంచి ముచ్కూరు వరకు ఉన్న రోడ్డును సింగిల్ లేన్ నుంచి డబుల్ లేన్‌కు మార్చేందుకు గాను రూ. 5కోట్లు.
- జిల్లాలోని 44వ జాతీయ రహదారి నుంచి పడకల్, కలిగోట్, చింతలూరు మీదుగా చేంగల్ వరకు 14 కిలోమీటర్ల మేర ఉన్న రోడ్డును సింగిల్ లేన్ నుంచి డబుల్ లేన్‌కు వెడల్పు చేసేందుకు గాను రూ. 16 కోట్లు.
- చౌట్‌పల్లి నుంచి జగిత్యాల జిల్లా సరిహద్దులోని రంగారావుపేట వరకు ఉన్న 5 కిలోమీటర్ల సింగిల్ లేన్ రోడ్డును డబుల్ లేన్ రోడ్డుగా మార్చేందుకు గాను రూ. 6కోట్లు.
- కమ్మర్‌పల్లి నుంచి తడపాకల్ వరకు ఉన్న 16 కిలోమీటర్ల మేర ఉన్న రోడ్డును అభివృద్ధి చేసేందుకు గాను రూ.6.43 కోట్లు.
- నందిపేట నుంచి నిర్మల్ జిల్లాలోని పంచగుడి వంతెన వరకు ఉన్న రోడ్డును అభివృద్ధి చేసేందుకు గాను రూ.18 కోట్లు.
- బోధన్ నుంచి సుంకిని వెళ్లే రోడ్డు వెడల్పు, అభివృద్ధి కోసం రూ.10 కోట్లు.
- నవీపేట నుంచి కళ్యాపూర్, నీలా, కందకుర్తి రోడ్డును అభివృద్ధి చేసేందుకు గాను రూ.5.50 కోట్లు.

కామారెడ్డి జిల్లాకు..

- కామారెడ్డి జిల్లా కేంద్రంలో వైద్య కళాశాల నిర్మాణం, దీనికి అనుబంధంగా సర్వజన ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేసి మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభించేందుకు గాను రూ. 20 కోట్లు కేటాయింపు.
- జిల్లాలో 4 కిలోమీటర్ల మేర కరీంనగర్-కామారెడ్డి-ఎల్లారెడ్డి ఫోర్ లైన్ రోడ్డు నిర్మాణానికి గాను రూ.12 కోట్లు.
- బాన్సువాడ నుంచి బిచ్కుంద వెళ్లే రోడ్డు అభివృద్ధి కోసం రూ.7 కోట్లు.
- లింగంపేట ప్రజాపనుల శాఖ రోడ్డును నల్లమడుగు, రామలక్ష్మణ్‌పల్లి మీదుగా గాంధారి ప్రజాపనుల శాఖ రోడ్డు వరకు అభివృద్ధి చేసేందుకు గాను రూ.6.50 కోట్లు విడుదల చేశారు.

క్లుప్తంగా

జిల్లా ప్రజలకు బక్రీద్ శుభాకాంక్షలు

సుభాష్‌నగర్: బక్రీద్ పండుగను పురస్కరించుకుని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు వేర్వేరు ప్రకటనల్లో జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్‌ను ఆధ్యాత్మిక వాతావరణంలో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎంగా సరస్వతి



ఖలీల్‌వాడి: నిజామాబాద్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్(ఆపరేషన్)గా సరస్వతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. డిపో మేనేజర్లు ఆనంద్, వెంకటేశ్వర్లు ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. హైదరాబాద్‌లో డిపో మేనేజర్‌గా పని చేసి పదోన్నతిపై నిజామాబాద్‌కు వచ్చారు.

డిగ్రీ పరీక్షలకు 215 మంది గైర్హాజరు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ సెమిస్టర్ పరీక్షల్లో బుధవారం 215 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు కంట్రోలర్ ఎం అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన డిగ్రీ 4వ, 5వ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ సెమిస్టర్ పరీక్షలకు 1133 మంది విద్యార్థులకు గానూ 962 మంది హాజరు కాగా 171 మంది గైర్హాజరైనట్లు కంట్రోలర్ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన డిగ్రీ మొదటి, 3వ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ సెమిస్టర్ పరీక్షకు 625 మంది విద్యార్థులకు 581 మంది హాజరు కాగా 44 మంది గైర్హాజరైనట్లు వివరించారు.

తెయూ విద్యార్థికి అభినందన



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ఉత్తమ విద్యార్థిగా తెలంగాణ యూనివర్సిటీ ఎంసీఏ ద్వితీయ సంవత్సరం విద్యార్థి బనావత్ గంగాధర్ ఎంపికయ్యారు. బుధవారం రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ రిక్కా లింబాద్రి గంగాధర్‌కు రూ.10వేల చెక్కు, సర్టిఫికెట్‌ను అందజేశారు. విద్యార్థి గంగాధర్‌తో పాటు రిజిస్ట్రార్ యాదగిరి, ప్రిన్సిపాల్ ఆరతిని అభినందించారు.

శివసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గోపి కిషన్



బోధన్: శివసేన ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు బోధన్‌కు చెందిన పసుపులేటి గోపి కిషన్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియామకం అయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ఉమ్మడి రాష్ట్ర పదాధికారుల సమావేశంలోఆయన పదవి బాధ్యతలు స్వీకరించారు. బుధవారం బోధన్‌కు వచ్చిన గోపి కిషన్‌ను నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ పార్టీ బలతోపేతానికి కృషి చేస్తానన్నారు. నాయకులు గౌతం, భూమన్న, శ్రీకాంత్, మధుబాబు, రవికిరణ్, ప్రీతం, రాజు, లోకేష్ గౌడ్, లింగం, వెంకటేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

కనుల పండువగా రథయాత్ర



రథాన్ని లాగుతున్న భక్తులు



రథం ముందు యువతుల కోలాటం



నృత్యం చేస్తున్న మహిళలు

నిజామాబాద్ సిటీ: నగరంలో నిర్వహించిన జగన్నాథ శోభాయాత్ర ఘనంగా జరిగింది. కంఠేశ్వర్ వద్ద ప్రారంభమైన యాత్ర రైల్వేకమాన్, ధర్నాచౌక్, రైల్వేస్టేషన్, తిలక్‌గార్డెన్, దేవీరోడ్ చౌరస్తా, గాంధీ చౌక్, పెద్దబజార్, న్యాల్‌కల్‌రోడ్ చౌర స్తా, పూలాంగ్ చౌరస్తా మీదుగా వినాయక్‌నగర్‌లోని విజయ లక్ష్మి ఫంక్షన్‌హాల్ వరకు కొనసాగింది. అనంతరం ఫంక్షన్‌హాల్‌లో సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. వేదాంత చైతన్య ప్రభు భక్తులకు ప్రవచనాలు చేశారు. ఇస్కాన్ జిల్లా అధ్యక్షుడు రామానంద రాయగౌడదాసు పాల్గొన్నారు.

హిందూ ధర్మం కోసం పాటుపడాలి

రథయాత్రలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా మాట్లాడుతూ హిందూ ధర్మం కోసం నిర్వహించే ప్రతి కార్యక్రమంలో ప్రజలంతా పాల్గొనాలన్నారు. జగన్నాధుడిను దర్శించుకుంటే సకల సమస్యలు దూరం అవుతాయన్నారు. రథ యాత్ర ముందు ధన్‌పాల్ బంగారు చీపురుతో ఊడ్చి యాత్ర ను ప్రారంభించారు.







రథయాత్రలో జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, బీజేపీ నేత సూర్యనారాయణ, భజనలు చేస్తున్న భక్తులు

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న కామారెడ్డి డీఆర్‌డీవో సాయన్న

డిచ్‌పల్లి: స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రభుత్వం, బ్యాంకులు అందజేస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని కామారెడ్డి జిల్లా డీఆర్‌డీవో సాయన్న సూచించారు. డిచ్‌పల్లిలోని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం (ఆర్‌ఎస్‌ఈటీఐ)లో కామారెడ్డి జిల్లాకు చెందిన ఎంపిక చేసిన 70 మంది ఐకేపీ సీపీలకు ఆర్థిక అక్షరాస్యత (ఎఫ్ఎల్‌సీఆర్‌పీ)పై ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన డీఆర్‌డీవో సాయన్న మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న బీమా పథకాలు, బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలను మొక్కుబడిగా కాకుండా స్వయం ఉపాధి పొందేలా మహిళా సంఘ సభ్యులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను గ్రామ స్థాయిలో సభ్యులకు తెలియజేసి వారిని చైతన్యం చేయాలని సూచించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న సీఏలకు టూల్‌కిట్స్, సర్టిఫికెట్స్‌ను డీఆర్‌డీవో అందజేశారు. ఆర్‌ఎస్‌ఈటీఐ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్, డీపీఎం రవీందర్, సిబ్బంది భాగ్యలక్ష్మి, రామకృష్ణ, రంజిత్, నవీన్ పాల్గొన్నారు.

కేజ్‌వీల్స్‌తో రోడ్డెక్కితే జరిమానా

- సమాచారం ఇచ్చిన వారికి రూ.వెయ్యి బహుమతి
- గాదేపల్లి జీపీ తీర్మానం



డొంకేశ్వర్(ఆర్మూర్): కేజీవీల్ ట్రాక్టర్లు బీటీ రోడ్లపై తిరగకుండా డొంకేశ్వర్ మండలంలో మరో గ్రామ పంచాయతీ ముందుకొచ్చింది. సాగు పనుల కోసం ట్రాక్టర్లకు ఇనుప చక్రాలు బిగించుకుని రోడ్లపై వెళ్ల కూడదని, ఒక వెళ్తే రూ.5వేల జరిమానా విధిస్తామని గాదేపల్లి పంచాయతీ తీర్మానం చేసింది. బీటీ రోడ్లపై ఎక్కడైనా తిప్పితే 9440469208 నంబరు సమాచారం అందించి పట్టిస్తే వారికి రూ.1,000 నగదు బహుమతి ఇస్తామని ప్రకటించినట్లు సర్పంచ్ నక్కల భూమేశ్ తెలిపారు. ఇనుప చక్రాలను పొలాల వద్దకు తీసుకెళ్లడానికి పంచాయతీ వద్ద ట్రాలీ ఆటోను అద్దెకు ఉంచుతున్నామని వెల్లడించారు. తీర్మాన సమావేశంలో ఉప సర్పంచ్ విక్రమ్, వార్డు సభ్యులు మోహన్, లత, సాయరెడ్డి, ముత్తెమ్మ, తదితరులున్నారు.

సఖి కేంద్రానికి ఇద్దరి తరలింపు



మహిళలను సఖి కేంద్రంలో అప్పగిస్తున్న ఇందూరు యువత అధ్యక్షుడు సాయిబాబు

నిజామాబాద్‌నాగారం: ఇద్దరు మహిళలను ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు బుధవారం సఖి కేంద్రానికి తరలించారు. న్యాల్‌కల్ గ్రామంలో ఉంటున్న పోసాని అనే వృద్ధురాలికి ఎవరు లేకపోవడంతో సర్పంచ్ గంగప్రసాద్ సమాచారం మేరకు రెస్క్యూ టీమ్ వెళ్లి ఆమెను సఖి కేంద్రానికి తీసుకొచ్చారు. జగిత్యాలకు చెందిన ఇంజుమాల అనే మహిళ కుటుంబ కలహాలతో ఇంటి నుంచి 20 రోజులుగా మాధవనగర్ వద్ద క్యాన్సర్ ఆస్పత్రికి వెళ్లే మార్గంలో ఉంటోంది. ఆమెను కూడా సఖి కేంద్రంలో అప్పగించారు. కార్యక్రమంలో ఇందూరు యువత వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దుకూరి సాయిబాబు, సఖి కేంద్రం సిబ్బంది శ్రీలక్ష్మి, పోలీసులు పాల్గొన్నారు.

కూలిన యూనియన్ బ్యాంక్ గోడ

- మూడు బైక్‌లు ధ్వంసం



మద్నూర్: మద్నూర్‌లోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో అద్దె భవనంలో కొనసాగుతున్న యూనియన్ బ్యాంక్‌పైన గల పిట్ట గోడ మంగళవారం రాత్రి కులిపోయింది. రాత్రి సమయంలో గోడ కూలడంతో పెద్ద ప్రమాదం తప్పింది. బ్యాంక్ ముందు వైపు పిట్ట గోడ బ్యాంకుకు ఆనుకోని ఉన్న రేకుల షెడ్డుపై పడడంతో రేకుల షెడ్డు ఒక్కసారిగా కుప్పకులింది. రేకుల షెడ్డు కింద పార్క్ చేసిన మూడు ద్విచక్ర వాహనాలు, విద్యుత్ స్తంభం ధ్వంసమయ్యాయి. స్తంభం విరిగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ట్రాన్స్ కో అధికారులు బుధవారం కొత్త స్తంభం ఏర్పాటు చేశారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: తప్పిదాలకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా తుది ఓటర్ల జాబితా ఉండాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ బుధవారం అయా శాసనసభ నియోజకవర్గాల ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు, తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా నుంచి వివిధ కారణాలతో పేర్లు తొలగిస్తే, సంబంధిత కుటుంబీకులకు రిజిస్టర్ పోస్టు ద్వారా ఆ సమాచారాన్ని తెలియజేయాలని సూచించారు. ఒకే ఇంట్లో ఆరుగురు అంతకంటే ఎక్కువమంది ఓటర్లు ఉన్నట్లు గుర్తిస్తే, క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అన్ని ప్రాంతాల్లో ఇంటింటి సర్వే పకడ్బందీగా జరిగేలా పర్యవేక్షణ చేయాలన్నారు. దివ్యాంగ ఓటర్ల పేర్లను ప్రత్యేకంగా మార్కింగ్ చేయాలని, దీని వల్ల పోలింగ్ కేంద్రాల్లో వారికి వీల్‌చైర్, ర్యాంప్ వంటి సదుపాయాలు సమకూర్చడానికి అవకాశం ఉంటుందన్నారు. ఓటరు జాబితాలో లోటుపాట్ల విషయంలో ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ కీలక పాత్ర పోషించాలన్నారు. డీఆర్డీవో చందర్, జెడ్పీ సీఈవో గోవింద్, ఆర్డీవోలు రవి, రాజేశ్వర్ పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

బిచ్కుంద: ముస్లింలు అత్యంత భక్తి శ్రద్ధలతో త్యాగానికి ప్రతీకగా జరుపుకునే పండుగ ఈదుల్ అజ్ హా(బక్రీద్). ఇష్టమైనవి త్యాగం చేసి అల్లాహ్‌ను ప్రసన్నం చేసుకునే పండుగను గురువారం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో జరుపుకోనున్నారు. ఈద్గా, మసీదులను శుభ్రం చేసి ప్రార్థనల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ పండుగ సందర్భంగా పొట్టేళ్లను (ఖుర్బానీ) ఇస్తారు. ఖుర్బానీ అంటే త్యాగం అని అర్థం. మూడు రోజులు పండగ జరుపుకుంటారు. ఖుర్బానీ పొట్టేళ్ల మాంసాన్ని మూడు బాగాలుగా విభజించి మొదటి భాగం ఇంటి కోసం, రెండో భాగం బంధువులకు, మూడోది నిరుపేదలకు పంపిణీ చేస్తారు.

హజ్‌యాత్ర ఈ మాసంలోనే..

ముస్లింలు జీవితంలో ఒక్కసారైనా హజ్ యాత్ర చేయాలనుకుంటారు. ఈ యాత్ర బక్రీద్ మాసంలోనే చేయటం ఆనవాయితీ. మదీనాలోని మహ్మద్ ప్రవక్త దివ్య సమాధి దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు తీర్చుకుంటారు. అనంతరం హాజీ యాత్రికులు అరఫాత్ మైదానం చేరుకొని తాము చేసిన పాపాలు క్షమించుమని అల్లాహ్‌తో వేడుకుంటారు. షైతాన్‌ను చిన్న రాళ్లతో కొట్టి పొట్టేలు ఖుర్బానీ ఇచ్చి హాజీలు యాత్ర ముగించుకుంటారు.

హజ్ యాత్ర పవిత్రమైనది



ముస్లింలు జీవితంలో ఒక్కసారైనా హజ్ యాత్రకు వెళ్లాలి. ఇస్లాం మతంలో మక్కా యాత్ర పవిత్రమైంది. పశ్చాత్తాపంతో అల్లాను వేడుకుంటే తెలిసి, తెలియక చేసిన పాపాలు క్షమించబడతాయని నమ్మకం.

– హఫీజ్ అబ్దుల్ అలీం, బిచ్కుంద

నత్తనడకన గేట్ల మరమ్మతులు

- ఇప్పటికీ పూర్తయినవి 18 గేట్లే..



గేట్లకు మరమ్మతులు చేస్తున్న కూలీలు

బాల్కొండ: ఎస్సారెస్పీ వరద గేట్ల మరమ్మతు పనులు నత్తనడకన సాగుతున్నాయి. వరద వచ్చే ముందు వర్షంలో కూడా వరద గేట్లను విప్పి మరమ్మతు చేస్తున్నారు. వరద గేట్ల మరమ్మత్తుల కోసం ప్రభుత్వం రూ.17.5 కోట్ల నిధులను గతేడాది మంజూరు చేసింది. గత మే నుంచి పనులు సాగిస్తున్నారు. అయిన ఇప్పటి వరకు 18 గేట్లకు మరమ్మతులు చేశారు. ప్రాజెక్ట్ నుంచి మిగులు జలాలు గోదావరిలోకి వదలడానికి 42 వరద గేట్లను నిర్మించారు. వాటి నిర్వాహణ సక్రమంగా లేక గేట్ల టన్ బక్కెలు విరిగిపోవడం, రోప్‌లు తెగిపోవడం జరిగింది. దీంతో మరమ్మతులు చేపడుతున్నారు. మూడు రోజులుగా చిరు జల్లులు, వర్షం కురుస్తున్న సమయంలో కూడా పనులు చేపడుతున్నారు. ఎలాంటి రక్షణ లేకుండానే పనులు చేస్తున్నారు. వర్షంలో పనులు చేపట్టడంతో పూర్తి స్థాయిలో మరమ్మత్తులు జరిగే అవకాశం ఉండదని అధికారులే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కాలం అనువుగా ఉన్నప్పుడు పనులు నిదానంగా చేసి, ఇప్పుడు వర్షంలో చేపట్టడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుంచి భారీ వరదలు వచ్చి గేట్లు ఎత్తే పరిస్థితి వచ్చినా ఇబ్బంది లేదని అధికారులు అంటున్నారు. మరమ్మతులు పూర్తయిన 18 గేట్ల ద్వారా గోదావరిలోకి నీటిని విడుదల చేయొచ్చని చెబుతున్నారు. మిగతా గేట్లను ఎత్తినా కూడా ఇబ్బంది లేదంటున్నారు. ఎత్తినప్పుడు సమస్య వస్తే అలానే వదిలేసే అవకాశం ఉంది. స్టాప్‌లాగ్ గేట్లను అమర్చి నీటి విడుదలకు అడ్డుకట్ట వేయొచ్చని అధికారులు భావిస్తున్నారు.

ఫీజులకు వ్యతిరేకంగా చట్టం చేసే వరకు ఉద్యమం



కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ నాయకుల ఆందోళన



అరెస్టు చేస్తున్న పోలీసులు

సుభాష్‌నగర్: ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజులకు వ్యతిరేకంగా చట్టం చేసేంత వరకూ ఉద్యమిస్తామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ రవి అన్నారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. అంతకుముందు గిరిరాజ్ కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్‌కు చేరుకున్న ఎస్ఎఫ్ఐ నాయకులను పోలీసులు అడ్డుకునేందుకు యత్నించారు. అయినప్పటికీ ప్రధాన గేట్ వద్ద బైఠాయించారు. ఈక్రమంలో కొంత తోపులాట చోటుచేసుకుంది. పోలీసులు నచ్చజెప్పినప్పటికీ విన్పించుకోకపోవడంతో పోలీసులు నాయకులను బలవంతంగా అరెస్ట్ చేశారు. అనంతరం తాటికొండ రవి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కనీసం టీచర్లు, స్కావెంజర్లను నియమించలేని ప్రభుత్వం మనకు అవసరమా అన్నారు. ఎంఈఓ పోస్టులు భర్తీ చేయాలని కోరితే అరెస్టులు చేస్తారా అని ప్రశ్నించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాచకొండ విఘ్నేష్, బోడ అనిల్, మహేష్, నాగరాజు, విశాల్, ప్రసాద్, జవహర్, సంధ్య, నీలిమ, శైలజ పాల్గొన్నారు.

డబ్బుల స్వాహాపై మహిళల ఆగ్రహం

- మహిళా సంఘాల డబ్బులను వాడుకున్న బీసీ పాయింట్ నిర్వాహకురాలు



మహిళలతో మాట్లాడుతున్న నాయకులు

నిజాంసాగర్: బ్యాంకు లింకేజీ డబ్బులతో పాటు స్త్రీనిధి డబ్బుల స్వాహాపై ఐకేపీ అధికారులు, సిబ్బంది పనితీరుపై స్వయం సహాయక సంఘాల మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని హసన్‌పల్లి గ్రామానికి చెందిన గ్రామ సంఘాల మహిళలు మండల పరిషత్ కార్యాలయాన్ని ముట్టడించారు. గ్రామంలోని 11 సంఘాల్లోని 200 మంది మహిళలు బ్యాంకు లింకేజీతో పాటు స్త్రీనిధి డబ్బులను బీసీ పాయింట్‌లో నెల, నెలా జమ చేశారు. పాయింట్ నిర్వాహకురాలు ఆ సంఘాల ఖాతాల్లో జమ చేయకుండా రసీదులు ఇచ్చారు. ఆయా సంఘాలకు సంబంధించి రూ. 27 లక్షలను బీసీ పాయింట్ నిర్వాహకురాలితో పాటు ఐకేపీ సిబ్బంది స్వాహా చేయడంతో మహిళలు ఆందోళన బాట పట్టారు. డబ్బులు ఇప్పించాలని సదరు మహిళలు, గ్రామస్తులు మండల కార్యాలయానికి వచ్చిన ఎంపీపీ పట్లోజ్యోతి దుర్గారెడ్డితో పాటు ప్రజా ప్రతినిధులను వేడుకున్నారు. నాలుగైదు రోజుల్లో డబ్బులు చెల్లించేలా చూస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు వెళ్లిపోయారు.

చెక్‌పోస్ట్ ఏర్పాటు

రుద్రూర్: పోతంగల్ శివారులో పోలీస్ చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. పోతంగల్‌కు మహారాష్ట్ర సరిహద్దు ఉన్నందున బక్రీద్ నేపథ్యంలో మహారాష్ట్ర నుంచి జిల్లాలోకి గోవులను తరలించకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఆవుల అక్రమ రవాణ నియంత్రణకు చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నారు.

హత్యాయత్నం కేసులో ఐదేళ్ల జైలుశిక్ష

ఖలీల్‌వాడి: ఒకరిపై హత్యాయత్నం చేసిన వ్యక్తికి ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ నిజామాబాద్ ఎస్సీ, ఎస్టీ న్యాయస్థానం స్పెషల్ జడ్జి శ్రీనివాస్ బుధవారం తీర్పు వెల్లడించారు. కేసు వివరాలు.. బోధన్ పట్టణానికి చెందిన కవల పోశెట్టి 2019 జూన్ 16న మోచిగల్లీకి వెళ్తున్నాడు. మార్గమధ్యలో తనకు పరిచయస్తుడైన సన్ను సింగ్ కనబడడంతో అతని వద్ద ఉన్న తల్వార్‌ను చూడటానికి ఇవ్వమని అడిగాడు. దీంతో ఆవేశానికి గురైన సన్ను సింగ్ 'నన్నే తల్వార్ ఇవ్వమని అడుగుతావా' అంటూ తల్వార్‌తో పోశెట్టి వెంటపడ్డాడు. చంపివేస్తానని అతనిపై తల్వార్‌తో దాడి చేశాడు. ఈ ఆరోపణలు న్యాయస్థానంలో విచారణలో నిరూపించబడ్డాయి. దీంతో ఐపీసీ 307 హత్యాయత్నంకు గాను ఐదేళ్ల కఠిన జైలుశిక్ష రూ.1000 జరిమానా, తల్వార్‌తో నేరానికి పాల్పడినందుకు మరో ఐదేళ్ల కఠిన జైలుశిక్షతోపాటు రూ.1000 జరిమానా విధించారు. రెండు శిక్షలు ఏకకాలంలో అనుభవించాలని తెలుపుతూ ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టంలో మోపబడిన నేరాలు నిరూపణ కానందున కొట్టివేశారు. జరిమానా చెల్లించకపోతే మరో నెల రోజుల జైలుశిక్ష గడపాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు. పోలీసుల తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కవితారెడ్డి వాదనలు వినిపించారు.

పేకాట స్థావరంపై దాడి

లింగంపేట: మండలంలోని నల్లమడుగు అటవీ ప్రాంతంలో పేకాడుతున్నారే సమాచారంతో బుధవారం దాడి చేసి నలుగురిని పట్టుకున్నట్లు ఎస్సై శంకర్ తెలిపారు. మరికొందరు పారిపోయారని చెప్పారు. స్థావరంలో రూ.76,866 నగదు, ఆరు బైక్‌లు, ఒక కారు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేశామన్నారు.

టీమార్ట్ అగ్నిప్రమాదంపై టాస్క్‌ఫోర్స్ విచారణ

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని టీమార్ట్ అగ్నిప్రమాదంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు నాలుగు రోజులుగా విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిసింది. నాలుగో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు వివరాలు, ఆధారాలను తీసుకున్నట్లు సమాచారం. ఘటన స్థలంలో సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి, వివరాలను సేకరిస్తున్నట్లు తెలిసింది.

క్రైం కార్నర్

మద్యం మత్తులో విద్యార్థులపై దాడి

- 12 మందికి గాయాలు.. ఆస్పత్రికి తరలింపు



చికిత్స పొందుతున్న విద్యార్థులు

వర్ని: వర్నిలోని జిల్లా పరిషత్ హై స్కూల్ క్రీడా మైదానంలో క్రికెట్ ఆడుతున్న విద్యార్థులపై మోహన్ అనే వ్యక్తి దాడి చేసి గాయపరిచాడు. బుధవారం ఉదయం ఎస్సీ హాస్టల్లో భోజనం ముగించుకొని పక్కనే ఉన్న జిల్లా పరిషత్ బాలుర హై స్కూల్ క్రీడామైదానంలో క్రికెట్ విద్యార్థులు క్రికెట్ ఆడటానికి వెల్లారు. వడ్డేపల్లి గ్రామానికి చెందిన మోహన్ మద్యం మత్తులో విద్యార్థులతో గొడవపడి కర్రతో విద్యార్థులపై దాడికి పాల్పడ్డాడు. దాడిలో 12 మంది హాస్టల్ విద్యార్థులకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న హైస్కూల్ ఉపాధ్యాయులు గాయపడిన విద్యార్థులను వర్ని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. మద్యం మత్తులో మోహన్ తాను క్రికెట్ ఆడుతానని గొడవపడినట్లు బాధిత విద్యార్థులు వెల్లడించారు. హాస్టల్ వార్డెన్ పోశెట్టి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దాడికి పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు రుద్రూరు సీఐ జాన్‌రెడ్డి వెల్లడించారు.

కొరియర్ పేరిట రూ.71 వేలు టోకరా

కామారెడ్డి క్రైం: కొరియర్ యాక్టివేషన్ పేరిట ఆన్‌లైన్ మోసగాళ్లు ఓ మహిళ ఖాతాల్లోంచి రూ.71,300 కాజేసిన ఘటన కామారెడ్డి మండలం శాబ్దిపూర్ గ్రామంలో వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రేకులపల్లి సుప్రద సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిగా పనిచేస్తుంది. ఆమెకు డీటీడీసీ కొరియర్ నుంచి మాట్లాడుతున్నానని ఓ గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. మీ ఆర్డర్ డీయాక్టివేట్ అయిందని, మరల యాక్టివేట్ చేయడానికి రూ.5 చెల్లించాలని చెప్పి ఓ లింక్ పంపించారు. వారు చెప్పిన విధంగా చేయడంతో కొరియర్ ఇంటికి వచ్చింది. కానీ మరోసటి రోజైన ఈ నెల 21న ఆమె ఖాతాలోంచి రూ.71,300 కట్ అయ్యాయి. మోసపోయినట్లు తెలుసుకుని బుధవారం దేవునిపల్లి పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

గుండెపోటుతో ఒకరి మృతి



రాజమల్లు (ఫైల్)

భిక్కనూరు: ఆటో యూనియన్ మండల అధ్యక్షుడు అంబల్ల రాజమల్లు (45) గుండెపోటుతో బుధవారం మృతి చెందాడు. బుధవారం వేకువజామున రాజమల్లు తన ఛాతిలో నొప్పి వస్తుందనడంతో కుటుంబ సభ్యులు కామారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడకు వెళ్లిన తర్వాత వైద్యులు పరీక్షలు నిర్వహిస్తుండగానే మృతి చెందాడు. రాజమల్లు కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రూ. ఐదు వేల ఆర్థిక సాయం అందజేశారు.